నమస్తే తెలంగాణ
వికారాబాద్
హైదరాబాద్, గురువారం 6 మార్చి 2025 | VIKARABAD

# మొదటి రోజు పరీక్ష సజావుగా..

**జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 8177 మందికిగాను 7937 మంది హాజరు**



వికారాబాద్ జిల్లాలోని ఓ పరీక్షా కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు

వికారాబాద్, మార్చి 5 : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష రాసేందుకు విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సజావుగా సాగింది. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు, పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 6638 మందికిగాను 6492 మంది పరీక్షలు రాశారు. ఒకేషనల్ విద్యార్థులు 1539 మంది రాయాల్సి ఉండగా 1,445 మంది రాసినట్లు ఇంటర్ నోడల్ అధికారి తెలిపారు.

## విద్యార్థి జీవితంతో చెలగాటం

**పరిగి :** ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థి జీవితంతో ఆడుకున్నది. ఫీజు పూర్తిగా చెల్లించేంతవరకూ హాల్ టికెట్ ఇవ్వకపోవడంతో ఆ విద్యార్థి సమయానికి సదరు కేంద్రానికి చేరుకోకపోవడంతో పరీక్ష రాయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. వికారాబాద్ జిల్లా పరిగిలోని శ్రీసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో వార్ల నగేశ్ అనే విద్యార్థి చదువుతున్నాడు. ఫీజు చెల్లించలేదనే కారణంతో కళాశాల నిర్వాహకులు అతడికి హాల్‌టికెట్ ఇవ్వలేదు. మంగళవారం రూ.3వేలు చెల్లించినా తనకు హాల్ టికెట్ ఇవ్వలేదని, బుధవారం ఉదయం మిగిలిన మొత్తాన్ని చెల్లించిన తర్వాతే హాల్ టికెట్ ఇచ్చారని.. దానిని తీసుకుని తుంకులగడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న పరీక్షా కేంద్రానికి అతడు ఉదయం 9.20కి చేరుకున్నాడు. అప్పటికే సమయం మించిపోవడంతో అక్కడి సిబ్బంది అతడిని లోనికి అనుమతించలేదు. దీంతో నగేశ్ కంట తడిపెడుతూ వెనుదిరిగాడు.



పరీక్షా కేంద్రానికి నగేశ్ ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించని అధికారులు



చేవెళ్ల ప్రభుత్వ కళాశాల పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

# ఫుడ్ సేఫ్టీ అధికారుల విస్తృత తనిఖీలు

**నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు నోటీసులు**



సిటీబ్యూరో, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్‌క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే ఎఫ్‌బీ ఫుడ్స్, అంబర్‌పేట మాక్సం బేకరీ, జై మాత, గో ఫ్రెష్, వావ్ చిన్న, కేఎఫ్‌సీ, మలక్‌పేట స్వాగత్ బార్, స్నేహ చికెన్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ క్రిస్టల్ బార్, చిక్కడపల్లి మోర్ రిటేల్, జీడిమెట్ల వెంకటేశ్వర ఫోర్‌జెన్ ఫుడ్స్, మియాపూర్ ప్యూర్ ఓ నేచురల్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇసామియా బజార్‌లో వెంకటేశ్వర మెడికల్ స్పోర్ట్స్, సుజాత డెయిరీ ఫాం, కోఠి గోకుల్ ఛాట్ బండార్, ఎంజే మార్కెట్‌లో కరాచీ బేకరీ, సంతోష్ దాబా, మదీనాగూడలో మధురం టిఫిన్స్, మియాపూర్ సాయి ఫుడ్స్, జవహర్‌నగర్ ఆహబ్ ఎంటర్‌ప్రైజెస్, బోలక్‌పూర్ 4 ఎం రెస్టారెంట్‌లలో అధికారులు తనిఖీలు చేపట్టారు. వంట గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని, పారిశుధ్య నిర్వహణ బాగులేదని అధికారులు గుర్తించారు. ఆహార భద్రత నిబంధనలు ఉల్లంఘించిన ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు నోటీసులు జారీ చేశామని, ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.



ఇబ్రహీంపట్నం ఠాణా పరిధి, మంగల్‌పల్లిలోని దినకర లేడీస్ హాస్టల్‌ను బుధవారం ఇబ్రహీంపట్నం పోలీసులు సీజ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్, రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. కొన్ని రోజుల కిందట ఆ హాస్టల్‌లో ఒంటరిగా ఉన్న ఓ యువతిపై ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు.
- ఇబ్రహీంపట్నం, మార్చి 5

# తాగునీటికి తండ్లాట

**వికారాబాద్ జిల్లాలో పాతాళానికి భూగర్భ జలాలు | ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గుతున్న వైనం**

- గతేడాది ఫిబ్రవరిలో 13.21 మీటర్ల లోతులో..
- ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి 13.58 మీటర్లకు..
- ఇంకుడు గుంతల నిర్వహణను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- ఇప్పటికే తాగునీటి సమస్యతో రోడ్డెక్కుతున్న ప్రజలు





వికారాబాద్ జిల్లాలో వేసవి కాలం ప్రారంభం కాకముందే భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత పెరగడంతో భూగర్భజలాలు క్రమంగా తగ్గుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. గతేడాది ఫిబ్రవరి నాటికి జిల్లాలో 13.21 మీటర్ల లోతులో భూగర్భజలాలుండగా, ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి 13.58 మీటర్ల లోతుకు జిల్లాలో భూగర్భజలాలు పడిపోయాయి. మార్చి చివరి నుంచి ఏప్రిల్, మే వరకు జిల్లాలో భూగర్భజలాలు ప్రమాదకర స్థాయిలో తగ్గే ప్రమాదముందని అంచనా వేస్తున్నారు. మరో వారం, పది రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశమున్న దృష్ట్యా భూగర్భజలాలు కూడా భారీగా తగ్గనున్నాయి. ఇప్పటికే జిల్లాలోని మెజార్టీ చెరువుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. చెరువులతోపాటు ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు క్రమంగా తగ్గుముఖం పడుతుండడం చూస్తే ఈనెలాఖరు నాటికి జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన కోట్‌పల్లి, లక్నాపూర్, జుంటుపల్లి, శివసాగర్, కాకరవేణి, అల్లాపూర్, నందివాగు, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు సగానికిపైగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి గ్రామపంచాయతీలోనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంకుడు గుంతలను నిర్మిస్తే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిగా ఇంకుడుగుంతల నిర్వహణను పూర్తిగా విస్మరించింది.

- వికారాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ)



దోమ మండలంలోని అయినాపూర్‌లో తాగునీటి కోసం పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు(ఫైల్)

## 13.58 మీటర్లకు భూగర్భ జలాలు

జిల్లాలో ఫిబ్రవరి చివరి నాటికి 13.58 మీటర్ల లోతుకు అడుగంటిపోయాయి. ఎండల తీవ్రత పెరగడంతో భూగర్భజలాలు క్రమంగా తగ్గుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి .37 మీటర్ల మేర నీటి నిల్వలు తగ్గాయి. అయితే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరీ దారుణంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

## మొదలైన తాగునీటి కష్టాలు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు తాగునీటి సమస్య లేకుండా ఇంటింటికి నల్లాల ద్వారా తాగునీరందించి తాగునీటి కష్టాలకు చెక్ పెట్టగా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లడంతోపాటు ట్యాంకర్ల వద్ద యుద్ధాలు నెలకొన్న పరిస్థితులను ప్రజలు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. గత నెల రోజులుగా ఎండల తీవ్రత పెరిగి భూగర్భజలాలు అడుగంటిపోవడంతోపాటు మిషన్ భగీరథ నీటి సరఫరా అంతంత మాత్రంగానే జరుగుతుండడంతో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ప్రజలు రోడ్డెక్కుతున్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచే జిల్లాలో తాగునీటి సమస్య నెలకొన్నది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నియోజకవర్గంలోనూ తాగునీటి కోసం తండాల ప్రజలు రోడ్డెక్కి ధర్నా చేస్తున్నారు. మరోవైపు ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో మిషన్ భగీరథ నీరు ఎప్పుడొస్తాయో తెలువని పరిస్థితి నెలకొన్నది. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించి వారానికి ఒక్క రోజు మాత్రమేనీటిని వదులుతున్నట్లు, కొన్ని గ్రామాల్లో అది కూడా లేకపోవడంతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మున్సిపాలిటీల్లోనూ మిషన్ భగీరథ నీటి సరఫరా మూడు, నాలుగు రోజులకోసారి సరఫరా అవుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. సరిగ్గా వేసవి రాక ముందే తాగునీటికి సంబంధించి పరిస్థితులు ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను గాలికి వదిలేసింది. గతేడాది వేసవికాలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చేసిన మరమ్మతులకు సంబంధించి రూ.4 కోట్ల నిధులు ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో ఈ ఏడాది తాగునీటి మరమ్మతుల పనులు ఏ విధంగా చేయించాలనే దానిపై సంబంధిత అధికారులకు తలనొప్పిగా మారింది.

## జిల్లాలోని మండలాల్లో అడుగంటిన భూగర్భ జలాలు మీటర్లలో..

| మండలం (గ్రామం) | మీటర్లు |
|---|---|
| వికారాబాద్ (మైలార్‌దేవ్‌పల్లి) | 42.98 |
| దుద్యాల | 29.88 |
| మర్పల్లి | 22.39 |
| మర్పల్లి (నర్సాపూర్) | 32.56 |
| నవాబుపేట్ (మాదిరెడ్డిపల్లి) | 21.28 |
| దోమ (దిర్సంపల్లి) | 17.25 |
| యాలాల (దేవనూర్) | 28.98 |
| ధారూరు (అంతారం) | 16.42 |
| దోమ | 14.25 |
| కోట్‌పల్లి | 14.56 |
| కులకచర్ల (ముజాహిద్‌పూర్) | 15.32 |
| పరిగి (రంగంపల్లి) | 42.35 |
| తాండూరు (ఉద్దండాపూర్) | 29.42 |
| జిన్‌గుర్తి | 19.48 |
| కొడంగల్ రుద్రారం | 15.46 |



## బస్ షెల్టర్‌నూ కిరాయికిచ్చారు..!

ఎర్రగడ్డ, మార్చి 5: అనుకున్నంత పని జరిగింది. ఆర్టీసీ ప్రయాణికులకు సేద తీర్చాల్సిన బోరబండ బస్ టెర్మినల్‌లోని బస్‌షెల్టర్ రాత్రికిరాత్రి హోటల్‌గా మారింది. డివిజన్‌కు చెందిన కొందరు ఘనులు రెండు రోజుల కిందట తమ ఆధీనంలోకి తీసుకున్నారు. షెల్టర్‌కు షెట్టర్ ను అమర్చి మంగళవారం రాత్రి ఓ వ్యక్తికి అద్దెకిచ్చారు. రూ.5 లక్షలు అడ్వాన్స్.. నెలకు రూ.25 వేలు కిరాయిగా ఒప్పందం కుదిరింది. షెల్టర్‌ను అద్దెకు తీసుకున్న వ్యక్తి అందులో హోటల్ వ్యాపారం మొదలు పెట్టాడు. కండ్ల ముందు ఇంత జరిగినా.. అటు ఆర్టీసీగానీ..ఇటు బల్దియా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది.

# నీళ్లు కరువై.. గుండె చెరువై..

**రంగారెడ్డి జిల్లాలో అల్లాడుతున్న అన్నదాతలు**

- గణనీయంగా తగ్గిన భూగర్భ జలాలు
- ఎక్కడికక్కడే ఎండిపోతున్న పొలాలు
- రైతుల శ్రమ, పెట్టుబడులు మట్టిపాలు
- తిప్పాయిగూడలో అన్నదాతల ఆక్రందన





రంగారెడ్డిజిల్లాలో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఆరుగాలం శ్రమించి అప్పులు తీసుకువచ్చి పెట్టుబడులు పెట్టి, వరినాట్లు వేసిన రైతులు కళ్ల ముందే పొలాలు ఎండిపోతుండటంతో వారి గుండె చెరువవుతున్నది. జిల్లావ్యాప్తంగా భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడంతో బోరుబావులు ఎండిపోయాయి. ఏ గ్రామంలో చూసినా ఎండిన వరి పైర్లే దర్శనమిస్తున్నాయి. ఎండిపోయిన పొలాలు పశువులు, గొర్రెలకు మేతగా మారిపోయాయి. మంచాల మండలం తిప్పాయిగూడ గ్రామంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామంలో సుమారు 400 మంది రైతులున్నారు. వీరిలో వందమందికి కూడా రైతు భరోసా రాలేదు. మిగతావారంతా పెట్టుబడి కోసం అప్పులు చేసి వరి వేశారు. వేసిన పంట కళ్ల ముందే ఎండిపోతుండటంతో కన్నీరుమున్నీరవుతున్నారు.

- రంగారెడ్డి, మార్చి 5 (నమస్తే తెలంగాణ)

### పెట్టుబడి పాయె.. కష్టం పాయె..



నేను ఓ పెద్ద రైతు వద్ద రెండెకరాల పొలం కౌలుకు తీసుకున్నా. ఆ పొలంలో సుమారు యాభై వేల అప్పు చేసి వరి వేశా. పొలం దున్నినప్పటి నుంచి నాట్లు, ఎరువులు వంటి వాటికి యాభై నుంచి అరవై వేల వరకు ఖర్చయింది. నాట్లు వేసి నెల రోజులు కాకముందే బోరు ఎండిపోయింది. దీంతో వరి పూర్తిగా ఎండిపోయింది. నేను నా కుటుంబం మొత్తం పొలం పనుల్లోనే ఉండి పనిచేశాం. మేము చేసిన కష్టం పోయినప్పటికీ అప్పులు తీర్చే మార్గం కనిపించడం లేదు.

- కళమ్మ, కౌలు రైతు, తిప్పాయిగూడ

### అప్పులు తీర్చాలంటే ఏదైనా అమ్మాల్సిందే..



యాసంగిలో ఆరెకరాల్లో వరి పంట సాగు చేశా. దీని కోసం సుమారు రెండు లక్షలు ఖర్చయింది. పంటల సమయంలో రైతు భరోసా రాలేదు. అంతకుముందు కూడా వేసిన పంటలకు బ్యాంకు నుంచి రుణం తీసుకున్నా. ఆ రుణం కూడా మాఫీ కాలేదు. ఇప్పుడు వేసిన పంట నీళ్లులేక పూర్తిగా ఎండిపోయింది. చేసేదేమీలేక పంటను గొర్లు మేపుకోవడానికి ఇచ్చేశా. ఈ పరిస్థితిలో అప్పులు తీర్చాలంటే ఏదైనా అమ్మాల్సిన పరిస్థితి వచ్చింది. ఎండిన పంట పొలాలకు ప్రభుత్వమే పరిహారం ఇవ్వాలి.

- జంగయ్య, రైతు, తిప్పాయిగూడ

### మూడెకరాలు ఎండిపోయింది



నాకున్న మూడెకరాల్లో రెండెకరాలు వరి పంట వేశాను. ప్రభుత్వం రైతు భరోసా కూడా ఇవ్వలేదు. అయినప్పటికీ వ్యవసాయమే ప్రధానం కాబట్టి అప్పులుచేసి పంట సాగు చేశా. ఉన్న బోరు పూర్తిగా ఎండిపోయింది. వేసిన పంట పూర్తిగా ఎండిపోయింది. పంట పొలాలను చూసి గుండె తరుక్కుపోతున్నది. ఈ పరిస్థితిలో పొలంవైపు వెళ్లడానికి ఇష్టంలేక, పశువుల మేత కోసం వదిలేశాను. ప్రభుత్వం ఆదుకుని తమ అప్పులను మాఫీ చేయాలి.

- గాన్నా, కడీలబావితండా